క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



జడ్చర్ల టౌన్: విద్యస్వేచ్ఛ ఫౌండేషన్, యువ జాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోని 40మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నోట్‌పుస్తకాలతో పాటు పెన్నులు, స్కేల్స్, పలకలు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో యువజాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధుసూదన్‌రెడ్డి, కాంప్లెక్స్ జీహెచ్‌ఎం చంద్రకళ, సభ్యులు బాలస్వామి, మహేందర్, ఉపాధ్యాయులు మాధవి, జ్యోత్స్న పాల్గొన్నారు.

జడ్చర్ల: ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, తదితర అభ్యసన సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు మాదవి, జ్యోత్స్న, స్వచ్ఛంద సంస్థ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 489, 490లలో మిగులు భూమిని స్వాధీన పర్చుకుని పేదలకు ఇంటి స్థలాలు, తదితర ప్రజోపయోగకరమైన వాటికి వినియోగించాలని కోరారు. సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవాబుపేట: వర్షాకాలంలో అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి నాగ్యానాయక్, ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లిం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మైనార్టీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు మహ్మద్ అయూబ్, అబ్దుల్ ఖాదర్, సిరాజ్‌ఖాన్, జైనుల్‌ఆబెదిన్ తదితరులు సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారు. పాలమూరు యూనివర్సిటీలో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలని, ముస్లింల అభ్యున్నతికి ప్రత్యేక సబ్‌ప్లాన్ అమలు చేయాలని షబ్బీర్ అలీకి విజ్ఞప్తి చేశారు.

నేడు రైతు భరోసా సంబరాలు

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మంగళవారం రైతు భరోసా సంబరాలు నిర్వహించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16న రైతు భరోసా నిధులు విడుదల ప్రారంభించి 24వ తేదీతో 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం పూర్తి అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, రైతులు కలిసి మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో సంబరాలు నిర్వహించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతు భరోసాను కేవలం తొమ్మి రోజుల్లో పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

గండేడ్‌లో బీఎల్‌ఓల సమావేశం

గండేడ్: మండలంలోని బూత్‌లెవల్ ఆఫీసర్లతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఓలు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

మహమ్మదాబాద్: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కావలి భీమయ్యకు చెందిన పాడి విద్యుదాఘాతంతో సోమవారం మృత్యువాతకు గురైంది. తన వ్యవసాయ పొలం లో మేతకు వెళ్లగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్‌తీగలకు తగిలి మృత్యువాత పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం చేయొద్దు

- జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర బోయి
- రోగుల భోజనశాల పరిశీలన
- సర్జికల్ గదుల్లో రిపేర్ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



జనరల్ ఆస్పత్రిలో భోజనశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలోని వార్డుల్లో శుభ్రం లేకపోవడంతో గమనించి ఆస్పత్రిలో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైకల్యం గల వారికి గుర్తింపు కార్డు జారీ చేసే క్యాంపును పరిశీలించి ఎంతమంది హాజరవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అన్ని వార్డులను తిరిగి పరిశీలించారు. మహిళా మెడికల్ వార్డు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ వార్డులు, మెడికల్ సర్జికల్ గదులను పరిశీలించారు. మెడికల్ సర్జికల్ గదుల్లో డ్రెయినేజీ మరమ్మతుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అధికారులు వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేసి గదులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆస్పత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది హాజరుశాతంపై సూపరింటెండెంట్‌ను అడిగారు. హాజరుశాతం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆస్పత్రిలో కరెంట్ పోయినప్పుడు వెంటనే జనరేటర్ ఆన్‌లో ఉండే ఆటో స్టార్టప్ సౌకర్యం కల్పించాలని సూచించారు. రోగులకు అందించే ఆహారశాలను పరిశీలించారు. కిచెన్‌రూం పరిశుభ్రంగా ఉండాలని, తాజా కూరగాయలతో వంట చేయాలన్నారు. రోగులకు ఇచ్చే మెనూ పరిశీలించారు. రోగులకు అందించే ఆహారాన్ని ఆర్‌ఎంఓ ఇన్‌చార్జి తిని పరిశీలించిన తర్వాత రోగులకు అందిస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికాంత్, ఎంఎచ్‌ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, డీఆర్‌డీఓ నర్సింహులు, తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ అంబులెన్స్ ప్రారంభం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీకి బహూకరించిన అంబులెన్స్‌ను కలెక్టర్ విజయేంద్ర ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌లోని కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ. 22.50 లక్షలతో యూనియన్ బ్యాంక్ ఫౌండేషన్ రెడ్‌క్రాస్‌కు అందజేసిన సెంట్రల్ ఏసీ అంబులెన్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్‌కు రక్త సేకరణలో ప్రథమ స్థానం రావడం అభినందనీయమని పాలక కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టరేట్‌లో వాటర్ కూలర్ ప్రారంభం

కలెక్టరేట్‌లో ఎస్‌బీఐ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను కలెక్టర్ విజయేందిర ప్రారంభించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ కలెక్టరేట్ శాఖ వారి సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వాటర్ కూలర్ ద్వారా జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.భాస్కర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ, మేనేజర్ మురళీకృష్ణ, రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్, ఎల్‌డీఎం కల్వ భాస్కర్, చీఫ్ మేనేజర్ సేల్స్ ఎస్‌బీఐ రీజియనల్ కార్యాలయం బాల సుబ్రహ్మణ్యం, చీఫ్ మేనేజర్ క్లాక్ టవర్ బ్రాంచ్ పీజీఎన్ శర్మ, ఎస్‌బీఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ సురేష్ నాయక్, రాష్ట్ర, జిల్లా ఎంసీ సభ్యులు లయన్ రమణయ్య, తిరుపతిరెడ్డి, మేనేజర్ నరసింహ, సిబ్బంది వసుంధర, లత, రవి ఉన్నారు

భారత సేవాశ్రమ సంఘం సేవలు ప్రశంసనీయం



విద్యార్థినులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

పాలమూరు: పేదల సంక్షేమానికి భారత సేవాశ్రమ సంఘం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ డీకే అరుణ అన్నారు. భారత సేవాశ్రమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి మునీశ్వర్ నందజీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం భారత సేవాశ్రమ సంఘం పని చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భారత సేవాశ్రమ సంఘం చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి మునీశ్వర నందజీ మాట్లాడుతూ సంఘం సేవలను మరింతగా విస్తరిస్తామని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిరణ్, జితేందర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



దేవరకద్రలో మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి

దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దేవరకద్ర మండల కేంద్రంలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, ఈ విషయం ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ మోస పూరిత హామీలను ఎండగడుతూ పోరాటం చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను నిలపడానికి సన్నద్ధం కావాలని కోరారు. ఈ నెల 30న అన్ని మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలను కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

దేవరకద్రలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు యజ్ఞ భూపాల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణంరాజు, రమేశ్, భరత్‌భూషన్, మాధవరెడ్డి, గట్టు మల్లేశ్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ పునఃప్రతిష్ఠకు రూ.18లక్షలు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ తరువాత మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం పునఃప్రతిష్ఠకు రూ.17లక్షలు కేటాయించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజావాణిలో సోమవారం తహసీల్దార్ నర్సింగరావుకు వినతిపత్రం సమర్పించారు. జాతీయ రహదారుల శాఖ విగ్రహ పునఃప్రతిష్ఠకు కేవలం రూ.61వేలు కేటాయించటం తగదన్నారు. మహాత్ముడు చూపిన మార్గంలోనే వారు చదువుకుని ఉన్నతవంతులుగా మారి అధికారంలోకి వచ్చిన విషయం విస్మరించారని, విగ్రహం పునఃప్రతిష్ఠకు రూ.18లక్షలు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని, లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయనకు వివరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కృష్ణయాదవ్, నడిమింటి శ్రీనివాసులు, ప్రజలందరిని ఆకర్షించేలా తీర్చిదిద్దాలని కోరారు. రమేష్‌నాయక్, జహంగీర్ పాష, గొడుగు నర్సింహులు, సురభి విజయ్‌కుమార్, లింగంపేట శేఖర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు గుర్తింపు తెచ్చేదే ప్రెస్‌క్లబ్



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టులకు గుర్తింపు తెచ్చేది ప్రెస్‌క్లబ్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మెట్టు గడ్డ ప్రాంతంలోని ప్రెస్‌క్లబ్‌లో ముడా నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటారు, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత్రికేయ మిత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాత్రికేయ మిత్రులు అందరూ ఐక్యంగా ఉండాలని, ఎలాంటి అసమానతలు లేకుండా అందరం జర్నలిస్టులమనే భావన ఉండాలన్నారు. సుప్రీంకోర్టు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకూడదని సూచిందని, అందుకే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. తొందర పడితే నష్టపోయే అవకాశం ఉంటుందని ఆయన హితవు పలికారు. అందరూ తప్పక హెల్త్ మరియు మెడికల్ బీమా తీసుకోవాలని సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో క్రమం తప్పకుండా ప్రెస్‌మీట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, తఖి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌చారి, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి యాద య్య, సంయుక్త కార్యదర్శి సతీష్ కుమార్, మణి ప్రసాద్, కృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్, ఈసీ సభ్య లు ఇట్కలి మోహన్‌దాస్, రవికుమార్, రామకొండ, హాహత్, శాబుద్దీన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఏనుగొండ రెవెన్యూ వార్డును ఎస్సీ రిజర్వుగా ప్రకటించాలి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ఏనుగొండ రెవెన్యూ వార్డును ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏనుగొండ రెవెన్యూ వార్డులో ఎస్సీ జనాభా అధికంగా ఉందన్నారు. కలెక్టర్ స్పందించి ఏనుగొండ రెవెన్యూ వార్డులో 5వ వార్డును ఎస్సీ రిజర్వుడ్‌గా ప్రకటించి, వచ్చే నగర పాలక సంస్థ ఎన్నికల్లో దళితులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రావులకృష్ణ, వర్కింగ్ ప్రెసి డెంట్ జయన్న, నర్సింహులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో ముస్లిం శ్మశానవాటికల కోసం స్థలాలు కేటాయించాలని కోరుతూ అల్‌పైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనికి వినతిపత్రం అందజేశారు. ఇప్పుడున్న కొన్ని శ్మశానవాటికలు సమాధులతో నిండిపోయాయని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల పట్టణంలో అనువైన చోట్ల శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, అబ్దుల్ అజీజ్, అజీజుర్ రహెమాన్‌లు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల కోర్టులో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించినట్లు అధ్యక్షుడు మాలిక్‌షాకీర్ ఒక ప్రకటనలో తెలిపారు. తోటి మహిళా న్యాయవాది హఫీజ ఇతర న్యాయవాదుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ విధుల బహిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇతర న్యాయవాదులను అసభ్యకరంగా దూషిస్తూ కక్షిదారుల ముందు సభ్యసమాజం తలదించుకునేలా దుర్భాషలాడుతూ విధులు నిర్వహించుకోకుండా ఆటంక పర్చటం, సిబ్బందిని అభద్రతాభావానికి గురిచేయటం వంటి కారణాలను నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు పేర్కొన్నారు. సదరు న్యాయవాదిపై తెలంగాణ న్యాయవాదుల మండలిలోనూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి రమేష్, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, ఖాజాఇఫ్తెకారొద్దీన్, మహేశ్వర్‌రెడ్డి, జి.విశ్వేశ్వర్, జంగయ్య, పురుషోత్తంరావు, కరీం, రాములు, యాదిరెడ్డి, అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన సత్యం, మాధురిల కుమార్తె సృజామి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన నిఫ్ట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) పరీక్షలో జాతీయ స్థాయిలో 869వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ర్యాంకు సాధించిన ఆమె ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నవాబుపేటలో శాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నవాబుపేట: శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశం కోసం బలిదానమయ్యారని, ఆయన చేసిన కృషి మరవలేనిదని బీజేపీ జిల్లా నాయకురాలు బాలత్రిపురసుందరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్స వం బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గణేష్, జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్, బీజేవైఎస్ అధ్యక్షుడు చంద్రప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

జడ్చర్ల టౌన్: డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకుని జడ్చర్ల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో 12వ వార్డు గాంధీనగర్ ట్రస్టులోని శివాంజనేయస్వామి ఆలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యంబీ బాలకృష్ణ, మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి, అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కవిత రైలురోకో చేస్తామనడం హాస్యాస్పదం

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జూలై 17న రైలురోకో చేస్తా రని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీసీలు కవితకు గుర్తుకురాలేదని, ఇప్పుడు కొ త్తగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చే యాలని కోరడం సిగ్గుచేటని పేర్కొన్నారు. బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు చాలా మంది బీసీ నాయకులు, మేధావులు ఉన్నారని, మీ రు మధ్యలో కల్పించుకొని మళ్లీ నీరుగార్చే కుట్ర లాగా అనిపిస్తోందని బీసీ సమాజం భావిస్తున్నట్లు తెలిపారు. బీసీ ఉద్యమ నాయకులు ఆలోచించి ముందుకు పోవాలని ఆయన కోరారు.

ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీల నియామకం

పాలమూరు: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీలను నియమిస్తూ సభ్యుల పేర్లను రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు శివప్రసాద్ సోమవారం ప్రకటించారు. రాష్ట్ర ఈసీ మెంబర్‌గా మహేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కృష్ణగౌడ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ప్రతిభ పటే ల్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడుగా గౌతమ్‌సింగ్, నారాయణపేట జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా తిమ్మయ్య, సోషల్ మీడి యా ఇన్‌చార్జిగా వెంకటేశ్‌గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా మహిపాల్‌నాయక్, మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్, జిల్లా మహి ళా ఉపాధ్యక్షురాలిగా శ్రీవల్లి, సోషల్ మీడియా ఇన్ చార్జిగా బాబు జగ్జీవన్‌రావును నియమించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతి కాలనీలోని అయ్యప్పగుట్టకు వెళ్లే వీధిలో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజావాణి' సందర్భంగా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.

2025 ఫైనాన్స్ బిల్లును ఉపసంహరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పెన్షనర్లకు శాపంగా మారిన 2025 ఫైనాన్స్ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను కాలరాసేలా కేంద్రం పార్లమెంట్‌లో 2025 ఫైనాన్స్ బిల్లును దొడ్డిదారిన ఆమోదింపజేసిందన్నారు. మార్చి 25న చట్టంగా మార్చిందని, 2026 జనవరి 1కంటే ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్లకు ఇకపై వేతన సవరణ ప్రయోజనాలు వర్తింపజేయకుండా మార్పులు చేపట్టిందన్నారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్, ఆర్‌సీటీపీ నాయకులు జయ కృష్ణారెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటన్నగౌడ్, రాఘవరెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వామన్‌కుమార్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



కౌకుంట్లలో ఇంటి నిర్మాణం ప్రారంభించిన నాయకులు

దేవరకద్ర రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం కౌకుంట్లలో ఎంపీడీఓ శివప్రసాద్, తహసీల్దార్ సుందర్‌రాజ్ ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ఎంపికైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, యువజన అధ్యక్షుడు నరేష్, కొండన్న, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాయపల్లి, గద్దెగూడెంలో..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి వెంకటాయపల్లి, గద్దెగూడెంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణయ్య ముగ్గు పోసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడొద్దు



పోలేపల్లి సెజ్‌లో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బుచ్చయ్య

జడ్చర్ల: పొగాకు, గంజాయి తదితర మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సంబంధిత డీఎస్పీ బుచ్చయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కోల్పోవడం జరుగుతుందన్నారు. వాల్ పోస్టర్లను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై జాగ్రత్తగా ఉండాలి

నవాబుపేట: మత్తు పదార్థాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని, వారికి తెలియకుండానే వారు నిత్యం అలవాటుగా తీసుకునే వాటిలో డ్రగ్స్ కలిపి అలవాటు చేస్తారని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మత్తు పదార్థాల నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలం లోని కొత్తపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డ్రగ్స్ మూలంగా చాలా నేరాలు జరుగుతున్నాయని, వాటి సంస్కృతి పట్టణాల నుంచి పల్లెలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పోలీసు బృందంతో పాటు పాఠశాలల, విద్యార్థులు కొత్తపల్లి వివిధ యువజన సంఘాలు పాల్గొన్నారు.

రాజాపూర్: మత్తు పానియాలు, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వీణా స్రవంతి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: ప్రస్తుతం పరిస్థితుల్లో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంఈఓ వెంకటాజీ, ఎస్‌ఐ తిరుపాజీలు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, సెల్‌ఫోన్ వాడకం, సైబర్ నేరాలు, ఇతర చెడుఅలవాట్లపై అవగాహన కల్పించారు.

తీరిన ట్రాన్స్‌ఫార్మర్ సమస్య

సాక్షి ఎఫెక్ట్..



నాడు ప్రమాదాలకు నిలయంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



నేడు ఎత్తులో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్

జడ్చర్ల టౌన్: టెర్రర్ ట్రాన్స్‌ఫార్మర్స్ అన్న శీర్షికతో ఈనెల 7న సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు అదేరోజున స్పందించిన విషయం విధితమే. ఆ స్పందన కారణంగానే నిమ్మబావిగడ్డ హనుమాన్ దేవాలయం వద్ద ప్రమాదాలకు నిలయంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. దిమ్మెను తొలగించి ప్రమాదాలు జరగకుండా ఎత్తులో అమర్చటంతో నిమ్మబావిగడ్డ వాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.